బోధనలో కృత్రిమ మేధ

- విద్యావ్యవస్థలో వినూత్న మార్పులు
- జిల్లాలో 698 ప్రాథమిక పాఠశాలల్లో అమలు


మర్కల్ ప్రాథమిక పాఠశాలలో పాఠాలు వింటున్న విద్యార్థులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పు తీసుకొస్తుంది. ప్రాథమిక స్థాయిలోనే డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు చేపట్టింది. దాంట్లో భాగమే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ(కృత్రిమ మేధ) విద్యా వ్యవస్థలోనూ దీన్ని వినియోగించుకొని విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలన్నదే ప్రధాన లక్ష్యం. దీనిని పకడ్బందీగా అమలు చేయడానికి జిల్లా వ్యాప్తంగా 698 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. ముఖ్యమంగా ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రత్యేకంగా చేపట్టిన ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) పథకానికి సాంకేతికతను జోడించి నైపుణ్యం పెంచేలా కార్యాచరణను రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా 698 ప్రాథమిక పాఠశాలల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

పరిశీలించి.. దృష్టి సారించి..

విద్యార్థులకు చదవడం, రాయడం కూడికలు తీసివేతలు ఏ మేర వచ్చనేది ఏఐ ద్వారా పరిశీలిస్తారు. ఎంపికైన పాఠశాలల్లో ఆరు కంప్యూటర్లతో ల్యాబ్ ఏర్పాటు చేస్తారు. ఏక్–స్టెప్ ఫౌండేషన్ ఏఐ లెర్నింగ్ టూల్స్ అయిన అసిస్టెడ్ లాంగ్వేజ్ లెర్నింగ్(ఎఎఎల్), అసిస్టెడ్ మ్యాథమెటిక్ లెర్నింగ్ (ఎఎంఎల్) సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేశారు. 1–5వ తరగతుల విద్యార్థులు ఎఫ్ఎల్ఎన్ ద్వారా నేర్చుకున్న అంశాలను కంప్యూటర్ ముందు చదివితే లోపాలను గుర్తిస్తుంది. తద్వారా వెనకబడి ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించేందుకు వీలుంటుంది.

- ఓ విద్యార్థికి శాశ్వత నంబరుతో పాటు 20 రోజులు కేటాయిస్తారు. ప్రతి 15 రోజులు తెలుగు, మిగిలిన రోజులు గణితంలో సామర్థ్యాలను పరీక్షించనున్నారు. ప్రతి 20 నిమిషాలకు ఒక బ్యాచ్ చొప్పున పాఠశాల పనివేళల్లో ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. ప్రతి విద్యార్థికి కేటాయించిన శాశ్వత గుర్తింపు సంఖ్యతో లాగిన్ కావాలి. విద్యార్థులు అక్షరాలను గుర్తించడం, చదవడం నేర్పిస్తుంది. తెలుగు, గణితంలో విద్యార్థి స్థాయిని అంచనా వేసి కొన్ని ప్రశ్నలు అడుగుతుంది. విద్యార్థి స్పందనను అంచనా వేసి స్థాయికి తగినట్టు కావల్సిన అభ్యసన ప్రశ్నలు వస్తాయి. ఒక సంపూర్ణంగా ముగిసిన తర్వాతనే మరొకటి తెరుచుకుంటుంది. వెనుకబడిన విద్యార్థుల్లో గణిత చతుర్విధ ప్రక్రియల సామర్థ్య శాతం పెంచుతుంది. తరగతుల నిర్వహణను విద్యాశాఖ అధికారులు, ఏక్–స్టెప్ సంస్థ ప్రతినిధులు పర్యవేక్షిస్తారు.

ప్రయోజనాలు ఇలా...

- ఏఐ ఆధారిత లెర్నింగ్ ప్లాట్‌ఫాం ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని విశ్లేషిస్తుంది. ఇందుకు అనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పనకు అవకాశం ఉంటుంది. నెమ్మదిగా నేర్చుకునే వారికి సాయంగా ఉంటుంది. వేగంగా అభ్యసించే వారు లోతైన జ్ఞానం సంపాదించవచ్చు.
- విద్యార్థులు ఏ సమయంలోనైనా సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశం ఉంటుంది.
- ఏఐ ట్రాన్స్‌లేషన్, స్పీచ్ టు స్పీచ్, సాఫ్ట్‌వేర్ కొత్త భాషను నేర్చుకోవడంలో సహాయ పడుతుంది.

పిల్లలు ఆసక్తిగా వింటున్నారు



ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులు ఏఐ పాఠాలను ఆసక్తిగా వింటున్నారు. ఏఐ ద్వారా విద్యార్థుల్లో మంచి ఫలితాలను ఆశించడానికి అవకాశం ఉంది. మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. కంప్యూటర్ అంటే విద్యార్థులకు ఆసక్తి పెరుగుతుంది. అంతే కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికి తీయడానికి ఎంతో ఉపకరిస్తుంది. కంప్యూటర్ ఆధారిత బోధన కావడంతో విద్యార్థుల హాజరు క్రమంగా పెరుగుతుంది. – యోసెఫ్, ఎంఈవో, సదాశివనగర్

భారత ప్రజాస్వామ్యం ఎంతో గొప్పది

- కామారెడ్డి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కిష్టయ్య
- ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం


మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య

కామారెడ్డి అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటర్లు ఎంత చైతన్యంగా ఉంటే అంతగా ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుందని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య అన్నారు. కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటే అంతగా దాని ఫలితాలు వస్తాయని అన్నారు. ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పలువురు అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. అధ్యాపకులు ఆకుల సుధాకర్, అంకం సుధాకర్, ఎస్.రాములు, పి.రాజ్‌గంభీర్‌రావు, జి.చంద్రశేఖర్‌గౌడ్, శ్రీకాంత్ రాథోడ్ తదితరులు మాట్లాడారు.

పాల్వంచ మండలాన్ని ఎస్సీలకు రిజర్వు చేయాలి



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన పాల్వంచ ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను ఎస్సీలకు రిజర్వు చేయాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు బెట్టంకి బాల్‌రాజు అన్నారు. సోమవారం జెడ్పీ సీఈవో, జిల్లా ఎన్నికల అధికారి చందర్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. గతంలో కొత్త మండలంల బీబీపేటను ఎస్సీలకు కేటాయించారని, ఈ సారి రొటేషన్‌లో పాల్వంచకు కేటాయించాలని వినతి పత్రంలో కోరారు. నాయకులు తమ్మిడి స్వామి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బట్టు వెంకటరాములు, పాల్వంచ మండల నాయకులు శంకర్‌బాబు తదితరులున్నారు.

పొంగి ప్రవహిస్తున్న లెండి వాగు

- గోజేగావ్‌కు నిలిచిన రాకపోకలు



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంతో పాటు ఎగువన మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండటంతో లెండి వాగు పొంగి ప్రవహిస్తోంది. మండలంలోని గోజేగావ్‌కు వెళ్లే రహదారిలో గల వంతెనపై నుంచి లెండి వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సోమవారం రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు రహదారిని మూసివేశారు. లెండి వరద తగ్గే వరకు ఈ మార్గంలోకి ఎవరూ రావద్దని తహసీల్దార్ ముజీబ్ సూచించారు. లెండి వాగును ఆయన పరిశీలించారు. ఆర్ఐ శంకర్, కాంగ్రెస్ నేతలు హన్మండ్లు స్వామి, రమేశ్ ఉన్నారు.

దివ్యాంగులకు ఇచ్చే పింఛను పెంచాలి


బాన్సువాడలో సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దివ్యాంగులు


కామారెడ్డిలో తహసీల్దార్ జనార్దన్‌కు..


బిచ్కుందలో తహసీల్దార్ వేణుగోపాల్‌కు..


తాడ్వాయిలో తహసీల్దార్ శ్వేతకు..

సాక్షి నెట్‌వర్క్: వృద్ధాప్య, వికలాంగులకు ఇచ్చే పింఛన్‌ను పెంచాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో హామీ ప్రకారం దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్‌ను అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మద్నూర్(జుక్కల్): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిన సందర్భంగా మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో సోమవారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు తుకారాం మాట్లాడుతూ..దేశంలో బీజేపీ పాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ప్రపంచంలోనే భారత దేశం ఒక గొప్ప దేశంగా ఎదిగిందని అన్నారు. నాయకులు తుల సంతోష్, పండిత్‌రావ్‌పటేల్, శంకర్‌పటేల్, కృష్ణపటేల్, తదితరులున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



దోమకొండ: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన సోమవారం సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి మాట్లాడారు. సంబంధిత వసతి గృహంపై కొన్ని పత్రికలో వచ్చిన వార్త వాస్తవం కాదని తెలిపారు. జిల్లా బీసీ సోషల్ వెల్ఫేర్ అధికారి చక్రధర్‌తో కలిసి విచారణ జరిపామని, వాస్తవం కాదని తమ విచారణలో తెలిందన్నారు. విద్యార్థులు, సిబ్బందికి పలు సూచనలు చేశామన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ



ఎల్లారెడ్డి: మల్లయ్యపల్లి ప్రాథమిక పాఠశాలకు సోమవారం ఈసీఎస్ సంస్థ ప్రతినిధి చంద్రశేఖరన్ మైక్‌సెట్‌ను బహూకరించారు. ఈసీఎస్ సంస్థ తరఫున ప్రతి పాఠశాలకు వస్తువుల రూపంలో సహాయం అందించడం సంతోషకరమని పాఠశాల ఉపాధ్యాయులు విశ్వనాథం అన్నారు. సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి


ఎల్లారెడ్డిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు


బాన్సువాడలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డి/తాడ్వాయి: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి, తాడ్వాయిలలో తెలంగాణ విమోచన దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించకుండా మోసం చేసిందని అన్నారు. బీజేపీ మాత్రమే విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు.

అధికారికంగా నిర్వహించాలి

బాన్సువాడ : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు కోనాల గంగారెడ్డి కోరారు. సోమవారం బాన్సువాడలో కరపత్రాలు ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారంగా నిర్వహిస్తామని చెప్పి గతంలో బీఆర్ఎస్ ప్రజలను మోసం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ కూడా అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా అధికారికంగా నిర్వహించకుండా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందని విమర్శించారు. నేతలు లక్ష్మీనారాయణ, శంకర్‌గౌడ్, సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, మజ్జిగ శ్రీనివాస్, చిరంజీవి, అనీల్, పాశం భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): భారీ వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీవో సురేందర్ అవగాహన కల్పించారు. సోమవారం ఆయన సురాయిపల్లి తండాలో ఇంటింటికి వెళ్లి గిరిజనులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. గిరిజనులు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గోవింద్‌రెడ్డి, ఠాగూర్, సరస్వతి, గంగామణి, రాజమణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన అధ్యాపకుడికి నివాళి



భిక్కనూరు: గుండెపోటుతో మృతి చెందిన హిస్టరీ అధ్యాపకుడు డాక్టర్ రమేష్ చిత్రపటానికి సోమవారం సౌత్‌క్యాంపస్‌లో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన ఆత్మశాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు యాలాద్రి, వైశాలి, ప్రతిజ్ఞ, మోహన్‌బాబు, సబివత సరిత, నారాయణ నర్సయ్య, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కుశాల్


మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కుశాల్

నిజాంసాగర్(జుక్కల్): ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కుశాల్ అన్నారు. సోమవారం మహమ్మద్ నగర్‌లో పీఆర్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, ప్రమోషన్లు కల్పిస్తామన్నారు. బీఎడ్ ఉన్న ఉపాధ్యాయులకు హెల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా అవకాశం కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మహమ్మద్ నగర్ పీఆర్టీయూ అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధానకార్యదర్శి వెంకట్రాంరెడ్డి, నిజాంసాగర్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి సురేందర్, తదితరులున్నారు.

అదే గోస.. అవే తిప్పలు

సాక్షి నెట్‌వర్క్: యూరియా కోసం అన్నదాతలు పడే కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. సోమవారం కూడా ఉదయం నుంచి సొసైటీ కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. వేకువ జామునే క్యూలైన్లు కట్టారు. రాళ్లు, చెప్పులు, పాసుపుస్తకాల జిరాక్స్ ప్రతులను క్యూలో పెట్టారు. కొన్నిచోట్ల యూరియాను పోలీస్ బందోబస్తు మధ్య రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు. మరికొన్ని చోట్ల యూరియా అందకపోవడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. యూరియా దొరకడం లేదంటూ రైతన్నలు మరోసారి మాచారెడ్డిలో రోడ్డెక్కి ఆందోళన చేశారు.


మాచారెడ్డిలో యూరియా కోసం రోడ్డెక్కి ఆందోళన చేస్తున్న రైతులు


బీబీపేటలో సొసైటీ వద్ద ..


భిక్కనూరు మండలం తిప్పాపూర్‌లో క్యూలైన్‌లో రాళ్లు, చెప్పులు

సరిపడా యూరియా ఇవ్వాలని వినతి

పిట్లం(జుక్కల్): పిట్లం మండలంలోని చిల్లర్గి సహకార సంఘం పరిధిలోని రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని సహకార సంఘం వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, సంఘం కార్యదర్శి సంతోష్ రెడ్డిలు సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డిని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిల్లర్గి సహకార సంఘం పరిధిలో ప్రస్తుతం 200 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి

క్లుప్తంగా

వరి పంట పరిశీలన



నస్రుల్లాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట పొలాలను సోమవారం ఏవో భవాని పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలకు ఎండాకు తెగులు సోకిందని గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. పిలకలు తొడిగె దశలో ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి, వీటి చుట్టూ డాగు మచ్చలుగా మొదలై అంచుల వెంబడి మట్టల వరకు వ్యాపిస్తాయని తెలిపారు. పసుపు పచ్చ జిగురువంటి బ్యాక్టీరియా ఎండ వేడిమికి గట్టిపడి చిన్న చిన్న వుండలుగా ఏర్పడతాయన్నారు. నివారణకు నత్రజని ఎరువులను వేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలని, పొలం నుంచి నీటిని తీసివేయాలన్నారు. ప్లాంటోమైసిన్ 0.2గ్రా +కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా.లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అగ్రిమైసిన్ 0.4గ్రా.+కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు.

నాగిరెడ్డిపేట ఎంపీడీవోగా లలితకుమారి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా లలితకుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఏడాది కాలంగా నాగిరెడ్డిపేట ఎంపీవో ప్రభాకరచారి తాత్కాలికంగా ఎంపీడీవో బాధ్యతలు నిర్వహించారు. ఆమె భద్రాది కొత్తగూడెం జిల్లా నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా సూర్యప్రకాష్‌గౌడ్



భిక్కనూరు: జంగంపల్లి గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా సూర్యప్రకాష్‌గౌడ్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ గౌడ్‌ని సత్కరించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేయడంతో పాటు గ్రామాభివృద్ధికి తోడ్పాటును అందిస్తానన్నారు.

భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డు తీసుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్: భవన నిర్మాణ కార్మికులు తప్పకుండా లేబర్ కార్డును పొందాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర నాయకులు సాయికుమార్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కార్మికుడికి ప్రభుత్వం ప్రమాదవశాత్తు లేదా సాధారణ మరణం పొందితే బీమా అందిస్తుందన్నారు. నాయకులు శ్యాం, లక్ష్మణ్, సాయిబాబా, రజాక్, నారాయణ తదితరులున్నారు.

పాఠశాలల నిర్వహణపై శిక్షణ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నిర్వహణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో షౌకత్ అలీ ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం డీఆర్పీలు మహిపాల్, రాములు స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్స్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

అంగన్‌వాడీ టీచర్లకు..



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఐసీడీఎస్ పరిధిలోని లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి, ఎల్లారెడ్డి మండలాల అంగన్‌వాడీ టీచర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని సీడీపీవో స్వరూప రాణి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్లకు పోషణ్ భీ పఢై భీ(పోషణ, చదువు) కార్యక్రమంపై 3 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పౌష్టికాహారంపై దృష్టి సారించడంతో పాటు చదువుపై శ్రద్ధ పెట్టడమేనన్నారు.

సంక్షిప్తం

ప్రమాద బీమా చెక్కు అందజేత

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యుడు బస్సి మధు సింగ్ ప్రమాదవశాత్తు జనవరిలో మరణించారు. దీంతో సంఘం తరపున రూ.2 లక్షల జనతా పర్సనల్ ప్రమాద బీమా చెక్కును సోమవారం సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో మృతుని భార్య సవిత అందజేశారు. సొసైటీ ఇన్‌చార్జి వైస్ చైర్మన్ సంగారెడ్డి, కార్యదర్శి సందీప్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): లింగంపల్లిలో సోమవారం గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సంతోష్‌కుమార్ మాట్లాడుతూ...ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో భవన నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, మాజీ సర్పంచ్ గుండెల్లి సాయిలు, మాజీ ఉప సర్పంచ్ దామోదర్ రావు, ఎడ్ల గంగారాం, గంగారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కిట్ల పంపిణీ



దోమకొండ: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం మండలానికి చెందిన 20 మందికి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 22 వస్తువులతో కూడిన కిట్లను అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయిన పేద కుటుంబాలకు వీటిని అందించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న వివరించారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సుధాకర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు, కామారెడ్డి డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, దోమకొండ మండల అధ్యక్షుడు బుర్రి రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట పరిధిలో..

రాజంపేట: ఇటీవల వర్షాల కారణంగా వరద ముంపునకు గురైన ఎల్లాపూర్, నడిమితండా వరద బాధితులకు సోమవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. మండల తహసీల్దార్ జానకి చేతుల మీదుగా సరుకులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఎం. రాజన్న, సెక్రటరీ రమేష్ రెడ్డి, మండల చైర్మన్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): నల్లమడుగు ప్రాథమిక పాఠశాలకు హైదరాబాదులో రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రవి సోమవారం కుర్చీలు వితరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎమిలియా తెలిపారు. చిన్నారులు నేలపై కూర్చుండడంతో వారికి కుర్చీలు కొనుగోలు చేసి అందజేసినట్లు తెలిపారు. దాతకు ప్రధానోపాధ్యాయురాలు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.